సాక్షి
ఖమ్మం

శుక్రవారం । 31 । మే । 2024



మట్టి మాఫియా..!

ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురంలో అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా కుంటలు, చెరువుల నుంచి మట్టి తరలిస్తున్నారు.

8లో



మేరీమాత స్వరూప ఆవిష్కరణ

ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన 76 అడుగుల మేరీమాత విగ్రహాన్ని పాలేరు చర్చిలో గురువారం వైభవంగా ఆవిష్కరించారు.

8లో



వాతావరణం

జిల్లాలో నేడు ఎండలు గరిష్టస్థాయిలో నమోదవుతాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం వేడిగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/తిరుమలాయపాలెం: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి, ఎర్రగడ్డ, గోపాలపురం, తిమ్మక్కపేట, తాళ్లచెర్వు, బీరోలు, బంధంపల్లి, బచ్చోడుతండా, సోలిపురం, రాజారం, పైనంపల్లి, జూపెడ, కాకరవాయి, సుద్దవాగు తండా, ముజాహిద్‌పురం, ఏనెకుంట తండా, మంగళిబండ తండా, రఘునాథపాలెం గ్రామాల్లో పొంగులేటి పర్యటిస్తారని వివరించారు. ఆయా గ్రామాల ప్రజలు మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని సూచించారు.

నిర్ణీత తేదీల్లో గోల్కొండ, శాతవాహన రైళ్లు రద్దు

- రేపటి నుంచి అమల్లోకి..

ఖమ్మం రాపర్తినగర్: దక్షిణ మధ్య రైల్వే నిర్మిస్తున్న మూడో లైన్ పనుల కారణంగా ఖమ్మం మీదుగా వెళ్లే గోల్కొండ, శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిర్ణీత తేదీల్లో రద్దు చేస్తున్నట్లు ఖమ్మం రైల్వే కమర్షియల్ ట్రాఫిక్ అధికారి ఎండీ జాఫర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నుంచి సికింద్రాబాద్, సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ జూన్ 1, 2, 5, 6, 8, 9 తేదీల్లో, విజయవాడ నుంచి సికింద్రాబాద్ వెళ్లే శాతవాహన ఎక్స్‌ప్రెస్(12713), సికింద్రాబాద్ నుంచి విజయవాడ వెళ్లే శాతవాహన ఎక్స్‌ప్రెస్(12714) రైలును జూన్ 1, 2, 5, 6, 8, 9 తేదీల్లో రద్దు చేసినట్లు వివరించారు.

పైపైకి పాతాళ గంగ..

ఖమ్మంవన్‌టౌన్: ఎండలు మండుతున్నాయి. గత కొన్ని రోజులుగా శాంతించిన భానుడు రెండు రోజులుగా తిరిగి ఉగ్రరూపం దాల్చాడు. బుధ, గురువారాల్లో ఎండ తీవ్రత అధికంగా నమోదైంది. అయితే ఐఎమ్‌డీ ఉపరితల ఆవర్తనం, ద్రోణి కారణంగా అకాల వర్షాలు కురవడంతో భూమి పొరల్లో నిక్షిప్తమైన గంగమ్మ కొన్ని మండలాల్లో పైపైకి వస్తోంది.

స్వల్పంగా పెరిగిన మండలాలివే..

ఉపరితల ఆవర్తనం, ద్రోణి కారణంగా ఇటీవల కొన్ని మండలాల్లో వర్షాలు కురిశాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ఏప్రిల్‌తో పోల్చిస్తే మే నెలలో భూగర్భజలాలు స్వల్పంగా పెరిగాయి. బోనకల్ మండలంలో 0.34, ముదిగొండ 0.25, కొణిజర్ల 0.71, సింగరేణి 1.88, కామేపల్లి 0.06, ఎర్రుపాలెం 1.83, రఘునాథపాలెం 0.46, తల్లాడ 1.26, వేంసూరు 0.87,తల్లాడ 0.14, ఏన్కూరులో 1.11 మీటర్ల మేర నీటి మట్టం పెరిగింది. జిల్లాలో సగటున 0.26 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయి. ఇక త్వరలో వర్షాలు పడితే భూగర్భ జల నీటిమట్టం మరింతగా పెరగనుంది.

నేటి నుంచి వెండితెర వెలుగులు

- తెరుచుకోనున్న సినిమా థియేటర్లు

ఖమ్మం గాంధీచౌక్: పది రోజులకు పైగా మూతబడి ఉన్న థియేటర్లు శుక్రవారం తెరుచుకోనున్నాయి. ప్రేక్షకులు రాకపోవడంతో ఈనెల 17 నుంచి సినిమా హాళ్లను మూసి ఉంచుతున్నట్లు తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రకటించిన విషయం తెలిసిందే. నాటి నుంచి మూతబడిన హాళ్లను తిరిగి తెరవాలని అసోసియేషన్ గురువారం నిర్ణయించడంతో శుక్రవారం నుంచి తిరిగి సినిమాలు ప్రదర్శించనున్నారు.

సమాజం కోసం పాటుపడితే జన్మధన్యం



ప్రవచనాలు చేస్తున్న చిన్నజీయర్‌స్వామి

అన్నపురెడ్డిపల్లి: భగవంతుడిని విశ్వాసంతో ఆరాధించి, సమాజం కోసం పాటుపడితే జన్మధన్యమవుతుందని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ప్రవచించారు. గురువారం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని ఆయన సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు చేశారు. బాలాజీ వెంకటేశ్వర స్వామివారి విశిష్టతను వివరించారు. అలాగే భూమాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వికాస తరంగిణి సమితి సేవలందిస్తోందని, పిల్లలు, మహిళల ఆరోగ్యం కోసం పనిచేస్తోందని పేర్కొన్నారు. సమాజం కోసం పనిచేసే వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. తొలుత చిన్నజీయర్ స్వామివారికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దంపతులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ పాకాల రమణ పాల్గొన్నారు.

ఆ.. విత్తనమే కావాలి



పత్తి సాగుకు రైతులు సన్నద్ధం

- డిమాండ్ ఉన్న విత్తనం కోసం పరుగులు
- సుదూర ప్రాంతాలకు వెళ్తున్న రైతులు
- జిల్లాలో అందుబాటులోకి పత్తి విత్తనాలు
- ఇతర రకాలతోనూ మంచి దిగుబడులు వస్తాయంటున్న వ్యవసాయ శాఖ

మరికొద్ది రోజుల్లో వ్యవసాయ సీజన్ ప్రారంభం కాబోతోంది. ఈ క్రమంలో రైతులు పత్తి తోటల కోసం దుక్కులు దున్ని విత్తనాల కోసం దుకాణాల బాట పట్టారు. అయితే గత ఏడాది దిగుబడిని దృష్టిలో పెట్టుకున్న రైతులు ఒకే రకం పత్తి విత్తనం కావాలని అడుగుతుండడంతో ఆయా రకాలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. జిల్లాకు వచ్చిన ఆ రకం పత్తి విత్తనాలు హాట్‌కేక్‌ల్లా అమ్ముడుపోతున్నాయి. ఎక్కువ మొత్తంలో ఈ విత్తనాలు కావాల్సిన రైతులు ఎంతదూరమైనా వెళ్లి తెచ్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే వ్యవసాయ శాఖ మాత్రం మిగతా రకాల విత్తనాలతో కూడా మంచి దిగుబడి సాధించొచ్చని చెబుతోంది. జిల్లాలో ఇప్పటికే పత్తి విత్తనాలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని కొనుగోలు చేయాలని సూచిస్తోంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

భూమికి పదును రావడంతో..

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో భూమికి పదును రావడంతో రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. అయితే మరో వారం నుంచి 15 రోజుల్లో వర్షాలు కురిస్తే కానీ పత్తి విత్తనాలు వేసే పరిస్థితి లేదు. రైతులు మాత్రం దుక్కులు దున్ని పత్తి విత్తనాలు నాటేందుకు అంతా సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో ఈ ఏడాది 2,01,834 ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇక దుక్కులు సిద్ధం చేసిన రైతులు పత్తి విత్తనాల కోసం దుకాణాల బాట పట్టారు.

అందుబాటులో విత్తనాలు..

సాగులో రైతులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం విత్తనాలు, ఎరువులను సీజన్ కన్నా ముందుగానే అందుబాటులోకి తెచ్చింది. ఈ క్రమంలో ఇప్పటికే ఖమ్మం జిల్లాకు అవసరమైన మొత్తం విత్తన ప్యాకెట్లు దాదాపుగా చేరుకున్నాయి. ఒక్కో ఎకరానికి రెండు ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరమవుతాయి. 475 గ్రాముల ప్యాకెట్ ధర రూ.864 ఉంటుంది. జిల్లాలో సాగవుతున్న 2,01,834 ఎకరాలకు 4 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం. ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి, అనావృష్టి తదితర అంశాలను దృష్టిలో పెట్టుకున్న జిల్లా అధికార యంత్రాంగం మొత్తంగా 5.60 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు తెప్పించాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు 4.50 లక్షల విత్తన ప్యాకెట్లు జిల్లాకు చేరాయి. వీటిలో 45 వేల ప్యాకెట్లను విక్రయం చారు. వర్షాలు కురిసి సీజన్ ప్రారంభమైన తర్వాత పరిస్థితులకు అనుగుణంగా రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచేలా వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

ఆ.. కంపెనీ విత్తనం కోసం..

పత్తి విత్తనాల్లో 200 నుంచి 300 రకాలు ఉంటాయి. అయితే ఇప్పుడు మాత్రం ఒకే రకం కంపెనీ విత్తనానికి డిమాండ్ పెరిగింది. అధిక దిగుబడి వస్తుందన్న కారణంతో ఈ విత్తనం కావాలని రైతులు ఎగబడుతున్నారు. దిగుబడిని ఇచ్చే ఇతర రకాలు అనేకం మార్కెట్‌లో ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులకు కావాల్సిన మేరకు విత్తనాలు అందుబాటులో ఉంచామని, ఒకే రకం విత్తనాలు అధిక దిగుబడిని ఇస్తాయనే ఆలోచన మానుకోవాలని సూచిస్తున్నారు. డిమాండ్ ఉన్న విత్తనాలు జిల్లాకు 10 వేల ప్యాకెట్లు రాగా ఇవి హాట్‌కేక్‌ల్లా అమ్ముడయ్యాయి. ఈ రకం విత్తనాల కోసం రైతులు దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. రైతులు వీటినే కోరుతుండటంతో నిల్వ ఉండటం లేదు. దీంతో కొన్ని చోట్ల ఒక్కో రైతుకు ఒకటి, రెండు ప్యాకెట్లు మాత్రమే ఇస్తుండడంతో దుకాణాల వద్ద భారీ క్యూలు దర్శనం ఇస్తున్నాయి. కొందరు రైతులు ఇక్కడ అందుబాటులో లేవని గుంటూరు, విజయవాడ, తెలంగాణలోని ఇతర ప్రాంతాలకు వెళ్లి ఈ రకం విత్తనాలు తెచ్చుకుంటున్నారు.

ఇతర రకాలనూ కొనుగోలు చేయండి..

ఒకే రకం పత్తి విత్తనాల కోసం వేచి ఉండకుండా.. ఇతర రకాలైన మంచి పత్తి విత్తనాలను కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇతర రకాలు కూడా మంచి దిగుబడిని ఇస్తాయని అంటున్నారు. యూఎస్ 7067 రకానికి జిల్లాలో బాగా డిమాండ్ ఉంది. అయితే ఇతర పత్తి విత్తన రకాలైన యూఎస్ 4708, యూఎస్ 4753, యూఎస్ 704, రాశీ స్విఫ్ట్, ఆర్‌సీహెచ్ 797, ప్లాటినం, సంధ్య గోల్డ్, ఆదియా, రేవంత్, మైకో (బాహుబలి), డస్‌దేవ్‌మ్, జంగి, ఎంఆర్‌సీ 7373, ప్రదీప్, రుద్రా, శంకర్ 07, అంకుర్, నవనీత్, జెకెసీ 0029 వంటి రకాలు కూడా మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. అలాగే వీటితోపాటు ఇంకా అనేక రకాల పత్తి విత్తన ప్యాకెట్లు గతంలో దిగుబడిని ఇచ్చినవి చూసుకుని కొనుగోలు చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఒకటే కంపెనీ, ఒకే రకానికి చెందిన పత్తి విత్తనాల కోసం రైతులు పోటీ పడొద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా సూచించారు.

ఎండలతో బెంబేలు..



నిర్మానుష్యంగా ఉన్న ఖమ్మం జెడ్పీ సెంటర్

- రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- వైరాలో గరిష్టంగా 47 డిగ్రీలు నమోదు
- ఈ వేసవిలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత

జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు (డిగ్రీలలో)

మండలం	ప్రాంతం	ఉష్ణోగ్రత
వైరా	వైరా	47
ముదిగొండ	పమ్మి	46.5
సింగరేణి	కారేపల్లిగేట్	46
ఖమ్మంఅర్బన్	ఖానాపురం	45.8
ముదిగొండ	బాణాపురం	45.7
మధిర	మధిర	45.4
కొణిజర్ల	కొణిజర్ల	45.4
చింతకాని	చింతకాని	45.2
నేలకొండపల్లి	నేలకొండపల్లి	45.1
తల్లాడ	తల్లాడ	45.1
కొణిజర్ల	పెద్దగోపతి	45

సాక్షిప్రతినిధి, ఖమ్మం : జిల్లాలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ద్రోణి ప్రభావంతో కొన్ని రోజులుగా చల్లబడినా.. రోహిణి కార్తె ప్రారంభంతో మళ్లీ సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఎండవేడిమి, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత రెండు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. వైరాలో గురువారం రికార్డు స్థాయిలో 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ వేసవిలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం. అలాగే ముదిగొండ మండలం పమ్మిలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, జిల్లాలోని 11 ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా నమోదవడం గమనార్హం.

ఠారెత్తిస్తున్న భానుడు..

ఈ వేసవి కాలం ప్రారంభం నుంచి విపరీతమైన ఎండలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మే నెల ప్రారంభంలో ముదిగొండ మండలం పమ్మిలో 46.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అప్పటి వరకు అదే అత్యధికం. ఉదయం 10 గంటలు దాటితే బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొన్నాయి. ఆ తర్వాత కొన్ని రోజులు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగాయి. అయితే ఉపరితల ద్రోణి కారణంగా కొద్దిరోజులు వర్షాలు కురవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇక రోహిణి కార్తె ప్రారంభమైన నేపథ్యంలో మళ్లీ ఇప్పుడు ఎండలు మండుతున్నాయి. ప్రస్తుతం సాధారణం కంటే ఒకటి, రెండు డిగ్రీలు ఎక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం గమనార్హం. రోహిణి కార్తెలో ఉక్కపోత కూడా ఎక్కువగానే ఉంటోంది.

వైరాలో 47 డిగ్రీలు..

జిల్లా వ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వైరాలో 47 డిగ్రీలు నమోదు కావడం విశేషం. ఈ వేసవి సీజన్‌లో జిల్లాలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. జిల్లాలోని మూడు ప్రాంతాల్లో 46 డిగ్రీలకు పైగా, ఎనిమిది ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా, 16 ప్రాంతాల్లో 44 డిగ్రీలకు పైగా, 13 ప్రాంతాల్లో 41 డిగ్రీల నుంచి 43 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించింది. ఎండ వేడిమికి వలువురు వడదెబ్బకు గురవుతుండగా రక్షణ చర్యలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

- విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయి
- ఆథరైజ్డ్ డీలర్ల వద్దే కొనుగోలు చేయండి
- కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్‌దత్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ సునీల్‌దత్

ఖమ్మం సహకారనగర్ /రఘునాథపాలెం : జిల్లాలో రైతులకు అవసరమైన పత్తి, జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందొద్దని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన సీపీ సునీల్‌దత్‌తో కలిసి విలేకరులతో, అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు, పీఏసీఎస్ సీఈఓలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పత్తి సాగులో రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లా మొదటి స్థానంలో ఉండగా.. ఖమ్మం రెండో స్థానంలో ఉందన్నారు. గతం కంటే ఈ ఏడాది పత్తి విత్తనాలు అధికంగా అందుబాటులో ఉంచామన్నారు. ఈ ఏడాది 2,01,834 ఎకరాల్లో పత్తి సాగయ్యే అవకాశం ఉండగా, అందుకు గాను 4 లక్షల ప్యాకెట్లు అవసరం అవుతుండగా 4.50 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని చెప్పారు. అదనంగా 1.60 లక్షల ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. రైతులు ఒకే రకమైన కంపెనీ విత్తనాల కోసం పోటీ పడొద్దని, అందుబాటులో ఉన్న వివిధ రకాల విత్తనాలను వినియోగించుకోవాలని సూచించారు. జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు మొత్తం 21,276 క్వింటాళ్లు జిల్లాకు కేటాయించగా ఇప్పటి వరకు 14,114.7 క్వింటాళ్లు వచ్చాయని తెలిపారు. ఇందులో 11,123.8 క్వింటాళ్లు విక్రయించగా 2990.9 క్వింటాళ్లు నిల్వ ఉన్నాయని పేర్కొన్నారు. విత్తనాలు ఎక్కడ పడితే అక్కడ కాకుండా ఆథరైజ్డ్ డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలన్నారు. బిల్లులు తీసుకుని పంట దిగుబడి చేతికందే వరకు భద్రపర్చుకోవాలని సూచించారు. రెండు రోజుల క్రితం బోనకల్‌లో రైతులు అధికంగా విత్తనాలు కొనుగోలుకు వచ్చారని, భారీ క్యూ ఉండటం విస్తృత ప్రచారం జరిగిందని, అయితే ఆరోజు పంపిణీ మంది రోజుగా భావించి రైతులు విత్తనాల కొనుగోలుకు వచ్చారే తప్ప కొరత, ఇతర అంశాలు కారణం కాదని వివరించారు. విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. వ్యవసాయ అధికారులు కూపన్లు జారీ చేయగానే పీఏసీఎస్‌లకు కేటాయించిన విత్తనాలు విక్రయించాలన్నారు. సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ..లైసెన్స్ లేనివారు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏడు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, నిత్యం టాస్క్‌ఫోర్స్ తదితర బృందాలతో నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

భూసార పరీక్ష కేంద్రం తనిఖీ..




విత్తన పరిశోధన కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ గౌతమ్

రఘునాథపాలెంలోని భూసార పరీక్ష కేంద్రాన్ని గురువారం కలెక్టర్ పరిశీలించి విత్తన తనిఖీ ప్రక్రియపై ఆరా తీశారు. విత్తన పరీక్షల్లో వేగం పెంచాలని, ఫలితం వచ్చాకే రైతులకు విక్రయించాలని అన్నారు. విత్తనాల జిల్లాకు చేరగానే పరీక్షలు చేపట్టాలని, కాంపిటీ ఇచ్చిన నాలుగు రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని అన్నారు. మట్టి పరీక్షల తీరుపైనా ఆరా తీశారు. పీఏసీఎస్‌ను తనిఖీ చేసి విత్తనాల విక్రయం, సరఫరా తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ చేశారు. అనంతరం విత్తన ప్రాసెసింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆ తర్వాత రాములుతండాలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను తనిఖీ చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఏవో విజయనిర్మల, ఫైరా కేవీకే శాస్త్రవేత్త రవికుమార్, డీఈఓ సోమశేఖరశర్మ, రఘునాథపాలెం ఎంఈఓ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ డీఈ చంద్రశేఖర్, ఏడీఏ సరిత, శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, ఏఈలు రాజు, చాయా, జుంటారి భాస్కరరావు, సొసైటీ సీఈఓ ఎం.వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్




మాట్లాడుతున్న మధుసూదన్‌నాయక్

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర అవతరణ దినోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వేడుకలను నిరాడంబరంగా నిర్వహించాలన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొనే కార్యక్రమాల్లో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు లేకుండా చూడాలన్నారు. జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో జూన్ 2న ఉదయం 8:15 గంటలకు పతకావిష్కరణ చేయాలన్నారు. ఆ తర్వాత అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించాలని, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలల అనంతరం కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ ఉంటుందని, జిల్లా అధికారులు, సిబ్బంది కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని, అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయాలని అన్నారు. సాయంత్రం లకారం ట్యాంక్‌బండ్ వద్ద ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నైరుతికి వేళాయె..

- వాన కబురుతో అన్నదాతల్లో ఆనందం



ఖమ్మంవ్యవసాయం : మండుటెండలతో సతమతమవుతున్న జిల్లా ప్రజలకు చల్లటి వాన కబురు రానే వచ్చింది. నైరుతి రుతుపవనాలు గురువారం కేరళ రాష్ట్రాన్ని తాకినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. మరో నాలుగు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశించే అవకాశం ఉందని తెలిపింది. అంటే జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి. కొద్ది రోజులుగా అత్యధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్న వేళ రుతుపవనాల ప్రవేశం కబురు ప్రజలను సంతోషానికి గురిచేస్తోంది. ప్రధానంగా రైతులకు ఇది తీపి కబురేనని చెప్పొచ్చు. కొద్ది రోజులుగా ఉపరితల ఆవర్తనం, ద్రోణితో కురిసిన అకాల వర్షాలకు జిల్లా రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. విత్తనాలు వేసేందుకు సన్నద్ధమవుతున్న రైతులకు వాతావరణ శాఖ ప్రకటన మరింత ఉత్సాహాన్నిచ్చింది.

పునాదుల్లోనే 'ప్రసాద్'..

- పథకం పనుల్లో అంతులేని జాప్యం
- భద్రాచలంలో రూ.41 కోట్లతో ప్రసాద్ పథకం పనులు
- 2022లో శిలాఫలకం వేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- మూడు భవనాలు నిర్మించాల్సి ఉండగా.. ఒకటే ప్రారంభం



మిథిలా స్టేడియం వెనుక పునాది దశలోనే ఉన్న ప్రసాద్ పథక భవన నిర్మాణం



దేవస్థానం ప్రాంగణంలో రాష్ట్రపతి ప్రారంభించిన శిలాఫలకం

భద్రాచలం: ప్రసాద్ పథకం పునాదులకే పరిమితమైంది. ప్రారంభించి 17 నెలలు గడిచినా, గడువు ముగిసినా నత్తనడకతో ముగుస్తున్నా పనులు ఇంకా బేస్‌మెంట్ దాటలేదు. కేంద్ర ప్రభుత్వం, పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రసాద్ (పిల్‌గ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిచ్యుల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్) పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా పుణ్యక్షేత్రాలను, ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి, పర్ణశాలలో పలు అభివృద్ధి పనులకు రూ.41 కోట్లు మంజూరయ్యాయి. 2022, డిసెంబర్ 28న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భద్రాచలం రామయ్యను దర్శించుకోగా, అనంతరం ఆలయ ప్రాంగణంలోనే వర్చువల్ పద్ధతిన ఈ పనుల ప్రారంభోత్సవం చేశారు. టెండర్ ప్రక్రియ ఆలస్యంగా గత మే 12న ఓ ప్రైవేట్ కంపెనీకి ఖరారు చేశారు. మే–2024 లోపు మూడు భవన నిర్మాణాలు పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. తొలి విడతగా రూ.22 కోట్లు విడుదల చేశారు.

రెండు భవనాల పనులే ప్రారంభించలేదు..

ఈ నెలాఖరుతో గడువు ముగియనుండగా, ఇప్పటి వరకు ఒక్క భవనం కూడా పూర్తికాలేదు. మిథిలా స్టేడియం వెనుక గతంలో వాహనాల పార్కింగ్‌గా ఉపయోగించిన స్థలంలో యాత్రికుల గదులు, ప్రత్యేక భవనాలు సంబంధించిన భవన నిర్మాణం ఒక్కటే సాగుతోంది. ఆ పనులు కూడా పునాది దశలోనే ఉన్నాయి. ఇక ఆర్‌అండ్‌బీ స్థలంలో ఒక భవనం, నూతనంగా నిర్మించిన గోదావరి రెండో బ్రిడ్జి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో మరో భవనం నిర్మించాల్సి ఉంది. కాగా ఇంతవరకు పనులే ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో భద్రాచలం, పర్ణశాలలో పూర్తి చేయాల్సిన పనులు ఎంతకాలం పడుతుందోననే చర్చ భక్తుల్లో సాగుతోంది. నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్, పర్యవేక్షించాల్సిన టూరిజం శాఖ అధికారుల అలసత్వమే ఇందుకు కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భక్తులను వేధిస్తున్న వసతి సమస్య

భద్రాచలంలో ప్రధానంగా భక్తులను వసతి సమస్య వేధిస్తోంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా వసతి గదులు, డార్మెటరీ హాళ్ల కరువయ్యాయి. ప్రసాద్ పథకంలో నిర్మించే భవనాలు పూర్తయితే కొద్ది మేర ఉపశమనం కలిగే అవకాశం ఉంది. కానీ అవి పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదు. ప్రతి ఏడాది దేవస్థానం ఆధ్వర్యంలో ముక్కోటి, శ్రీరామనవమి, భద్ర రామదాసు జయంతి, శబరి, పాకల దమ్మక్క ఉత్సవాలను పెద్ద ఎత్తున జరుపుతున్నారు. వీటితోపాటు ఇటీవల కాలంలో భక్తుల రాక పెరిగింది. దీంతో వసతి సమస్య తీవ్రమవుతోంది.

వర్షాకాలం వస్తే..

రానున్న వర్షాకాలంలో వానలు, గోదావరి వరదలతో నిర్మాణ పనులు చురుకుగా సాగవు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని 'ప్రసాద్'పనులను వేగవంతంగా పూర్తి చేసే భక్తులు కోరుతున్నారు. రామాలయంలో నిత్యకల్యాణ మండప రూఫింగ్, అభయాంజనేయ స్వామి ఆలయంలో, మిథిలా స్టేడియంలో డిజిటలైజ్ హౌస్‌లు, ఫ్లోరింగ్, ప్రసాదాల తయారీ విభాగపు ఆధునికీకరణ, టైల్స్ ఇతర పనులు చేపట్టాల్సి ఉంది. ఈ సమస్యలపై దేవస్థానం అధికారులు విన్నవించుకుంటున్నా.. పనులకు 'మోక్షం' లభించలేదు. నిర్మాణ పనుల్లో జాప్యంపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. టూరిజం శాఖ అధికారులు అందుబాటులోకి రాలేదు.

క్లుప్తంగా

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పంతులు


తేజావత్ పంతులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ హకీం విదేశీ పర్యటనకు వెళ్తున్న క్రమంలో తేజావత్ పంతులుకు పూర్తి బాధ్యతలు అప్పగించారు. పంతులు సంఘంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పని చేసిన అనుభవంతో పాటు రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా సభ్యుడిగా ఉన్న నేపథ్యాన పంతులుకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు హకీం తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పంతులు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

కొండగట్టు అంజన్నకు రామయ్య వస్త్రాలు


కొండగట్టు ఆలయంలో పట్టువస్త్రాలతో ఈఓ రమాదేవి తదితరులు

భద్రాచలం: జగిత్యాల జిల్లా కొండగట్టులో వేంచేసి ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం తరఫున గురువారం పట్టువస్త్రాలు అందజేశారు. జూన్ 1న హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రామాలయ ఈఓ ఎల్.రమాదేవి పట్టువస్త్రాలతో కొండగట్టుకు వెళ్లారు. అక్కడి అర్చకులు ఆలయ మర్యాదలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికి ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ భవానీ రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట రైతు హల్‌చల్

కూసుమంచి: కూసుమంచిలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఓ రైతు పురుగుమందు డబ్బాతో హల్‌చల్ చేశాడు. మండలంలోని గన్యాతండాకు చెందిన గుగులోత్ శ్రీను అనే రైతు తన తండ్రి తన వాటాగా రావాల్సిన భూమిని తన సోదరుడి పేరున రిజిస్ట్రేషన్ చేయించేందుకు సిద్ధం అయ్యాడని, అట్టి రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలంటూ ఆందోళనకు దిగాడు. దీనిపై పూర్తి విచారణ నిర్వహించి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతు ఆందోళనను విరమించాడు.

అత్తగారింటి వద్ద పురుగుల మందు తాగి అల్లుడు మృతి

పాల్వంచరూరల్: అత్తగారి ఇంటికి వచ్చిన అల్లుడు భార్య కాపురానికి రావడంలేదని మనస్థాపం చెంది పురుగుమందు తాగి మృతిచెందిన సంఘటన కారెగట్టులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి కారెగట్టు గ్రామానికి అశ్వాపురం మండలం గొందిగూడెంకు చెందిన కొమరం రాము(32) బుధవారం అత్తగారింటికి వచ్చాడు. భార్య అరుణ కాపురానికి రావడంలేదని పురుగు మందు తాగగా అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. దీంతో ఏరియా ఆస్పత్రికి ఆపై కొత్తగూడెంకు తరలించిగా అక్కడ చికిత్స పొందుతూ రాత్రి సమయంలో మృతి చెందాడు. కొమరం పెద్దగుండురాజులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

కొత్తగూడెంరూరల్: పాల్వంచ మండలం గట్టాయిగూడెం గ్రామానికి చెందిన శెట్టి తరుణ్ (23) తన స్నేహితుడిని కలవడానికి ఇల్లెందుకు స్కూటీపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టి పల్లిగ్రామం వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.14,229

మట్టి మాఫియా..!


ఏదులాపురం చెరువులో ట్రాక్టర్‌లో మట్టిని నింపుతున్న జేసీబీ

అక్రమ మట్టి దందారాయుళ్లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కుంటలు, చెరువులను వదలకుండా వాటిని గుల్ల చేస్తున్నారు. కనిపించిన మట్టి గుంటల వద్ద యంత్రాల సాయంతో మట్టిని తోడేస్తూ.. ఇళ్ల నిర్మాణాలు, వెంచర్ల ఏర్పాటుకు తరలిస్తూ.. దళారులు జేబులు నింపుకుంటున్నారు. చెరువుల మట్టి తోలకాలతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి కనిపిస్తున్నా.. ఇరిగేషన్, మైనింగ్ అధికారులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

యథేచ్ఛగా అక్రమ మట్టి తోలకాలు

- రైతుల పేరుతో అనుమతులకు దరఖాస్తు
- మంజూరు కాకుండానే మట్టి తరలింపు
- ఇళ్ల నిర్మాణాలు, వెంచర్లకు తరలిస్తున్న వైనం
- కాసులు కురిపిస్తున్న అక్రమ దందా
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని మైనింగ్, ఇరిగేషన్ అధికారులు

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం చెరువులో గత కొంతకాలంగా అక్రమార్కులు జోరుగా సాగిస్తున్న ఈ మట్టి దందా.. అక్రమార్కులపై కాసుల వర్షం కురిపిస్తోంది. గత దశాబ్దకాలంగా ప్రభుత్వ భూములు, గుట్టల్లో దశలవారీగా తవ్వి అక్రమార్కులు మట్టిని భారీ మొత్తంలో తరలించారు. పగలు, రాత్రి వేళల్లో బహిరంగంగానే యథేచ్ఛగా చెరువు మట్టిని వెంచర్లకు తరలిస్తున్నా.. సంబంధిత అధికారుల్లో ఏమాత్రం చలనం లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏకంగా పెద్ద జేసీబీలను పెట్టి టిప్పర్లు, ట్రాక్టర్లలో భారీగా మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ మట్టి విలువ రూ. 800 నుంచి రూ.1,000 వరకు, టిప్పర్‌కు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. సమయం దొరికినప్పుడల్లా ఇదే పనిగా మట్టిని తరలిస్తున్నారు.

నిరంతరాయంగా మట్టి తరలింపు..

ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కిన కొందరు అక్రమార్కులు 400 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఏదులాపురం చెరువు నుంచి పది జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా చెరువు మట్టిని సమీపంలో వెంచర్లకు తరలిస్తున్నారు. గత నెల రోజులుగా నిరంతరాయంగా తరలిస్తున్నా.. సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లు ఉండడంతో ఇదంతా వారి కనుసన్నల్లోనే జరుగుతుందనే ఆరోపణలున్నాయి. మట్టి దందారాయుళ్లు కేవలం పేరుకే ఇద్దరు రైతులతో తమ పొలాలకు మట్టి కావాలని దరఖాస్తు చేయించి.. ఆ చిన్న సాకుతో భారీ ఎత్తున మట్టిని తరలించి వ్యవసాయ పొలాలకు కాకుండా రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ఇళ్ల నిర్మాణాలకు తరలిస్తున్నారు. ఇలా రోజుకు దాదాపు 1,200 ట్రిప్పులు మట్టిని తరలిస్తున్నారంటే గత నెల రోజులు నుంచి ఎంతమేర మట్టిని తరలించారో అర్థం చేసుకోవచ్చు. దాదాపు కోట్ల రూపాయలు దందారాయుళ్ల జేబుల్లోకి వెళ్లాయని తెలుస్తోంది.

నిబంధనలు ఇలా..

- ఏదైనా ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్వి ఇతర ప్రదేశాలకు తరలించాలంటే ముందుగా రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి.
- తాము ఇంత విస్తీర్ణంలో చెరువు మట్టిని తీసుకెళ్తామని దరఖాస్తు చేసుకుంటే అధికారులు ఆ దరఖాస్తును పరిశీలించి క్యూబిక్ మీటర్ల ప్రకారం రుసుం కట్టించుకుని అనుతిస్తారు. అధికారులు అనుమతిచ్చిన మేరకే మట్టిని తరలించాల్సి ఉంటుంది.
- ఒక వేళ రైతులు తమ పొలాలకు చెరువు మట్టిని తరలించాలనుకున్నా.. ఈ మూడు శాఖల నుంచి అనుమతి తప్పక తీసుకోవాలి. కాకపోతే రైతులు ప్రభుత్వానికి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం ఉండదు.



ప్రభుత్వాదాయానికి భారీ గండి?

ఇదిలా ఉండగా మట్టిని తరలించడానికి అన్ని అనుమతులు తీసుకుని మట్టి తీసుకెళ్లాల్సిన అక్రమార్కులు.. అనుమతులు లేకుండానే తరలించడంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడినట్లయింది. నిబంధనల మేరకు ప్రభుత్వానికి రుసుం చెల్లించి మట్టి తరలిస్తే.. గత నెల రోజుల వ్యవధిలో దాదాపు రూ.60 లక్షల వరకు ఆదాయం వచ్చి ఉండేది.

అధికారి 'సాక్షి'గా చెరువుమట్టి తరలింపు..

చెరువులో మట్టి తరలిస్తున్న విషయం తెలుసుకున్న 'సాక్షి'గురువారం క్షేత్రస్థాయికి వెళ్లగా.. అక్కడ సంబంధిత ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉండగానే మట్టి దందారాయుళ్లు మట్టిని తరలించడం గమనార్హం. బాబూ పైఅధికారులు వస్తున్నారు.. తవ్వడం ఆపేసి పక్కకు పెట్టండి అంటూ దందారాయుళ్లను వర్క్ ఇన్‌స్పెక్టర్ బతిమిలాడటం విశేషం. అక్రమంగా మట్టిని తరలిస్తున్న యంత్రాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేయించాల్సిన వర్క్ ఇన్‌స్పెక్టరే ఇలా చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో వారికే తెలియాలి.

మావోయిస్టు మిలీషియా దంపతుల లొంగుబాటు..


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్ / చర్ల : సీపీఐ నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన మడకం లింగా, మడవి గంగి అనే మిలీషియా దంపతులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. గురువారం కొత్తగూడెంలోని జిల్లా ఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజు లొంగిపోయిన దంపతులు మిలీషియా సభ్యులుగా కొనసాగిన వారి వివరాల ను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుసుమ జిల్లా పాట్టేమంగు గ్రామం, చింతగుప్ప కృష్టారం పీఎస్ పరిధిలకు చెందిన వారు సీఆర్‌పీఎఫ్ 81 బెటాలి యన్, 141 బెటాలియన్, జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారని తెలిపారు. మడకం లింగా 2009 ఏడాదిలో మిలిషియా కమాండర్ ఏర్రా సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరారని, 2010 వరకు మిలీషియా సభ్యుడిగా చేసిన అనంతరం 2014 వరకు హరిభూషన్ టీం ప్రొటెక్షన్‌కు బదిలీ చేశారన్నారు. 2014లో ఏరియా కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొంది మణుగురు ఏరియా ఎల్‌జీఎస్ కమాండర్‌గా ఇప్పటి వరకు కొనసాగాడని చెప్పారు. అదేవిధంగా మడవి గంగి 2011లో చర్ల మిలీషియా కమాండర్ అయిన పోడియం జయరాం సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరి 2013 ఏడాది వరకు సీఎన్‌ఎం (చైతన్య నాట్యం మండలి)లో సభ్యురాలిగా, 2014 వరకు చర్ల ఏరియా మిలీషియా సభ్యురాలిగా ఉందని తెలిపారు. 2014 నుంచి 2018 వరకు హరిభూషన్ ప్రొటెక్షన్ టీంలో 2018 వరకు పని చేసిందని ఆ తరువాత మడకం లింగాను వివాహం చేసుకున్నట్లు తెలిపారు. తరువాత ఏరియా కమిటీ సభ్యురాలిగా పదోన్నతిని పొంది ఇప్పటి వరకు సీపీఐ నిషేధిత మావోయిస్టు పార్టీలో కొనసాగిందన్నారు. నిషేధిత మావోయిస్టు పార్టీ అగ్ర నాయకులు వేధింపులు తాళలేక, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలనే ఉద్దేశంతో ఆపరేషన్ చేయూతతో ఆకర్షితులై లొంగిపోయినట్లు దంపతులు తెలిపినట్లు చెప్పారు. లొంగిపోయిన వారు ప్రశాంత జీవితం గడపాలనుకునే దళం సభ్యులు వారి కుటుంబ సభ్యులు ద్వారా కాని స్వయంగా తమ దగ్గరలోని పోలీసు స్టేషన్‌లో, జిల్లా ఉన్నతాధికారులను సంప్రదించాలని అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు జీవనోపాధిని కల్పించడం, పునరావసం కల్పించడం కోసం ప్రభుత్వం తరఫున అందించాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలను అందించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, చర్ల సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ పల్టీ..

- రీసైక్లింగ్ చేసిన పీడీఎస్ బియ్యంగా అనుమానం
- సూర్యాపేట నుంచి మధిరకు తరలిస్తుండగా ఘటన
- స్పందించిన రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారులు


బోల్తాపడిన బియ్యం లోడ్ వద్ద అధికారులు

బోనకల్: సూర్యాపేట నుంచి మధిరకు పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న డీసీఎం వ్యాన్ బోనకల్ మండలం మధిర క్రాస్ రోడ్డు వద్దకు రాగానే రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని గురువారం బోల్తాపడింది. డీసీఎంలో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు ప్రయాణిస్తుండగా.. బోల్తా పడిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. ఇది గమనించిన స్థానికులు పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో తహసీల్దార్ పున్నం చందర్, ఆర్ఐ లక్ష్మణ్ నాయక్, ఎస్సై మధులు ఘటన స్థలానికి చేరుకొని బియ్యాన్ని పరిశీలించగా.. పీడీఎస్ బియ్యంగా అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయమై డీసీఎంలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులను ప్రశ్నించగా.. సూర్యాపేట నుంచి మధిర వెళ్తున్నట్లుగా తెలిపారు. డీసీఎం వ్యాన్‌లో 25 కేజీల బ్యాగ్‌లు 100 ఉన్నట్లు గుర్తించారు. సివిల్ సప్లయీస్ జిల్లా అధికారులు చందర్‌కుమార్, ఆర్ఐ కిరణ్‌కుమార్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని శాంపిల్స్ తీసి బియ్యాన్ని మధిర సివిల్ సప్లయీస్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేశారు. కాగా, పేద ప్రజలకు అందాల్సిన పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి 25 కేజీల బ్యాగ్‌లలో నింపి మధిరలోని ఓ ప్రైవేటు వ్యాపారం చేసే షాపుకు తరలిస్తున్నారు. ఏలాంటి అనుమానం రాకుండా కొత్తరకం దందాకు పూనుకొని బియ్యాన్ని తరలించడం విశేషం.

మద్యం మత్తులో యువకుడి హత్య..

- కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో యువకుల మధ్య ఘర్షణ
- పరారీలో నిందితుడు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ అబ్దుల్ రెహమాన్


గుణదీప్ (ఫైల్)


ఘటన స్థలం వద్ద వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంటౌన్: పట్టపగలు మద్యంమత్తులో ఇద్దరు వ్యక్తులు గొడవ పడ్డారు. ఎవరు చెప్పినా వినకుండా విచక్షణారహితంగా ఒకరినొకరు కొట్టుకున్నారు. దీంతో ఓ యువకుడు మరణించగా.. నిందితుడు పరారీలో ఉన్నాడు. స్థానికులు, స్నేహితుల కథనం ప్రకారం వివరాలిలా.. కొత్తగూడెం కూలీలైన్‌కు చెందిన ఎల్లబోయిన సమ్మయ్య (లేట్), లలిత దంపతులకు హిమవంత్, గుణదీప్(22) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇందులో గుణదీప్ హైదరాబాద్‌లో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నారు. బుధవారం సాయంకాలం కొత్తగూడెం తాటిపల్లి రెసిడెన్సీ సమీపాన గుణదీప్‌తో పాటు అతడి స్నేహితులతో గొడవ పడ్డాడని, గురువారం గుణదీప్‌ను తన ఇంటి వద్ద నుంచి గంగా అనే మిత్రుడు మధ్యాహ్నం సమయాన బయటికి తీసుకెళ్లాడు. కొత్తగూడెం వన్‌టౌన్ పోస్టాఫీస్ సెంటర్‌లోని ఖమ్మం బస్టాండ్ సెంటర్ సమీపాన ఉన్న మద్యం షాపుకు గుణదీప్, గంగాలు వెళ్లారు. ఈ క్రమంలో విద్యానగర్ కాలనీకి చెందిన కోటి అనే వ్యక్తి అక్కడకు వచ్చాడు. అయితే గుణదీప్ అన్నయ్య హిమవంత్‌కు విద్యానగర్ కాలనీలో ఉన్న స్నేహితులకు కోటికి మధ్య ఘర్షణలు జరిగాయని ఆ గొడవను దృష్టిలో పెట్టుకుని హిమవంత్ తమ్ముడిపై కోటి విచక్షణా రహితంగా దాడి చేయడంతో గుణదీప్ మరణించారని స్థానికులు పేర్కొన్నారు. గుణదీప్‌తో పాటు వచ్చిన గంగా పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. గుణదీప్ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి స్థానికులు తరలించగా.. ఘటన స్థలాన్ని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్, శివప్రసాద్, ఎస్సై రవిలతో సందర్శించి హత్య జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకుని నేరానికి పాల్పడిన వ్యక్తిని పట్టుకుంటామన్నారు. కాగా, గుణదీప్ మరణవార్తను గోదావరిఖనిలో సింగరేణి ఉద్యోగం చేస్తున్న అతడి అన్న హిమవంత్‌కు సమాచారం అందించారు. తల్లి ఒంటరిగా ఉండి రోదించడం అందరిని కలచి వేసింది.

వైభవంగా మేరీమాత స్వరూప ఆవిష్కరణ


ఆలయంలో ప్రతిష్ఠించిన మేరీమాత స్వరూపం

కూసుమంచి: పాలేరులోని మేరీమాత పుణ్యక్షేత్రం (చర్చి)లో ఆసియా ఖండంలోనే అతి పెద్దదిగా 76 అడుగుల ఎత్తులో నిర్మించిన మేరీమాత స్వరూప ప్రతిష్ఠా కార్యక్రమాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలేరు ఆలయ విచారణ కర్త, రెవరెండ్ ఫాదర్ కొమ్ము ఆంథోని ఆధ్వర్యాన గ్రామంలో కోలాటాలు, కళా ప్రదర్శనల నడుమ శోభాయాత్రను నిర్వహించగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పీఠాధిపతులు డాక్టర్ సగిలి ప్రకాష్, ఉడుముల బాల, కరణం ధమన్, ఖమ్మం విశ్రాంత పీఠాధిపతి మైపస్ పాల్‌తో పాటు ప్రొవెన్షల్ సుపీరియర్ (వరంగల్) బీజీ జోసఫ్ పాల్గొని భక్తులకు తమ దైవ సందేశాన్ని, దీవెనలను అందించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి డాక్టర్ సగిలి ప్రకాశ్ మాట్లాడుతూ.. ఏసు మార్గం సకలజనులకు మార్గదర్శకమని, మేరీమాత విగ్రహావిష్కరణ చేపట్టడం అభినందనీయమని, ఇది పర్యాటక ప్రాంతంగా నిలుస్తుందని అన్నారు. అనంతరం పాలేరు విచారణ కర్త కొమ్ము ఆంథోని తన 25 ఏళ్ల సేవలకు గాను నిర్వహించిన గురుత్వ రజిత జూబ్లీ వేడుకల్లో ఆయనను మతాధిపతులు, ఫాస్టర్లు ఘనంగా సత్కరించారు. వేడుకల కన్వీనర్ కొమ్ము ప్రసాద్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ వేడుకలో ఉమ్మడి తెలుగు రాష్ట్రా ఫాస్టర్లు, భక్తులు హాజరయ్యారు.

మన్నికకు పేరెన్నిక భారతి సిమెంట్

తాపీ మేస్త్రీల సమావేశంలో ఇంజనీర్ సాగర్ రెడ్డి


తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లు అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

ఇల్లెందు: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను రాష్ట్రంలో విడుదల చేసిందని సంస్థ ఏరియా సేల్స్ ఇన్‌చార్జ్ విజయ సింహ తెలిపారు. సిమెంట్ రంగంలో ఇతర సంస్థలతో పోలిస్తే మూడు రేట్లు మెరుగైందని సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సాగర్ రెడ్డి అన్నారు. ఇల్లెందులోని శివకేశవ సిమెంట్, ఐరన్ షాప్‌లో గురువారం తాపీ మేస్త్రీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. మార్కెట్‌లో లభించే ఇతర రకాల సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందని తెలిపారు. ముఖ్యంగా శ్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి ఈ సిమెంట్ ఉత్తమమైందని పేర్కొన్నారు. జెర్మనీ టెక్నాలజీ, రోబోటిక్ ల్యాబ్, టాంపరింగ్ ప్రూఫ్ బ్యాగ్‌తో సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. భారతి సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రిట్ సమయంలో నిపుణులైన ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ పడుతారని తెలిపారు. ఈ సందర్భంగా 60 మంది తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్లు అందజేశారు. కార్యక్రమంలో డీలర్ శ్రీకాంత్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

33 కేవీ విద్యుత్ లైన్ పనులు ప్రారంభం


33 కేవీ విద్యుత్ లైన్ పనుల నిర్వహిస్తున్న సిబ్బంది

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సరఫరాను మెరుగుపర్చేందుకు పమ్మి 132/33 కేవీ సబ్ స్టేషన్ నుంచి కమలాపురం 33/11 కేవీ సబ్ స్టేషన్ వరకు 33 కేవీ విద్యుత్ లైన్ పనులను గురువారం నుంచి ప్రారంభించారు. పమ్మి నుంచి కమలాపురం వరకు ఉన్న 4.9 కిలో మీటర్ల పొడవున నిర్మించే కేవీ విద్యుత్ లైన్ పనులకు టీజీ ఎన్పీడీసీఎల్ రూ. 23.13 లక్షలను మంజూరు చేయగా.. జిల్లా ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈ ఎ.సురేందర్ పర్యవేక్షణలో కన్స్ట్రక్షన్స్ డీఈ హీరాలాల్, ఏడీఈ కిరణ్ చక్రవర్తి, ముదిగొండ ఆపరేషన్స్ ఏడీఈ భీమ్‌సింగ్, ఏఈ ప్రసాద్, పమ్మి సబ్ స్టేషన్ ఏఈ నారాయణలను పనులను ప్రారంభించారు. నూతన 33 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణంతో కమలాపురం, బాణాపురం, వల్లభి విద్యుత్ సబ్ స్టేషన్లకు విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని ఎస్ఈ సురేందర్ తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

ముదిగొండ: మేడేపల్లిలోని సాయిబాబా దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఆలయంలోని సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామిల పంచలోహ విగ్రహాలు, సాయిబాబా వెండి పాదుకలు చోరీ చేశారని ఆలయ పూజారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. ఆలయ పూజారి వెంకట శ్రీనివాసచార్యులు గురువారం ఉదయం దేవాలయానికి వెళ్లగా.. గేటుకు వేసిన తాళం పగులగొట్టి ఉంది. దీంతో ఆలయంలోపలికి వెళ్లగా రూ.75వేలు విలువైన సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాలు, సుమారు రూ.25వేలు విలువైన వెండి పాదుకలను గుర్తు తెలియన వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించారు. దీంతో ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు ముదిగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరి గడ్డి దిండ్లు దగ్ధం..

నేలకొండపల్లి: వరి గడ్డి దిండ్లు దగ్ధమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని సుర్ధేపల్లి గ్రామానికి చెందిన ఎం.లలితకు చెందిన వరిగడ్డి దిండ్లకు గురువారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దిండ్లు ఇళ్లకు ఆనుకుని ఉండడంతో గ్రామస్తులు భయాందోళన చెంది మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఈదురు గాలులకు మంటలు వ్యాపించాయి. దీంతో ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వగా.. వారు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే 200 వరి గడ్డి దిండ్లు పూర్తిగా కాలిపోయాయి.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

యువకుడికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: నేలకొండపల్లికి చెందిన చిన్నపొంగు క్రాంతి అనే యువకుడు గురువారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి బైక్‌పై కూసుమంచి రహదారిలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలోని రహదారి వద్దకు వెళ్లాడు. అదే సమయాన మండలంలోని గువ్వలగూడెం గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు ఆ ప్రాంతానికి వచ్చి క్రాంతి బైక్‌పై కూర్చున్నారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరుగగా.. క్రాంతి చెవి తెగి తీవ్ర గాయం కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి ఆపై ఖమ్మం తరలించారు. కాగా, బాధితుడు తండ్రి వీరస్వామి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడిని బీరు బాటిల్‌తో దాడి చేయడంతో చెవి పూర్తిగా తెగిందని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రైలుకింద పడి రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

చింతకాని: మండల పరిధిలోని రామకృష్ణాపురం రైల్వే స్టేషన్ సమీపాన కర్లపూడి నాగభూషణం(59) అనే రిటైర్డ్ ఉద్యోగి గురువారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం బీకే బజారుకు చెందిన నాగభూషణం ఖమ్మం ఎస్డీఓ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందాడు. ఆయన కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అనారోగ్య సమస్యను తట్టుకోలేక గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్ల లు ఉన్నారు. మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు బృందం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు..

ఖమ్మంక్రైం: తాను తాగిన మద్యం మత్తే అతడికి శపమైంది. పొట్టచేతితో పట్టుకొని రాష్ట్ర సరిహద్దులు దాటివచ్చిన అతడు మత్తులో విగతజీవిగా మారాడు. వనటౌన్ సీఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన అమిత్‌కుమార్ (27) కొంతకాలంగా నగరంలోని కమాన్‌బజార్‌లో నివాసం ఉంటూ పచ్చబొట్టు షాపులో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను గతంలో ఉన్న తనరూమ్‌ను ఖాళీ చేసి ఇటీవల తనతో పాటు పనిచేసే దీపక్‌కుమార్ రూమ్‌లో ఉంటున్నాడు. అయితే బుధవారం రాత్రి కూడా మద్యం సేవించి వచ్చిన అతను కిటికీ అద్దాలను బలంగా కొట్టడంతో చేతికి తీవ్ర గాయమైంది. మద్యం మత్తులో ఉన్న అతడి స్నేహితుడు గమనించక పోవడంతో ఆ రాత్రి తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు వదిలాడు. గురువారం ఉదయం లేచిన దీపక్‌కుమార్ రక్తపు మడుగులో అమిత్‌కుమార్ కనిపించడంతో వెంటనే స్థానికులను పిలవగా వారు వచ్చి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని మార్చురికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.